క్లుప్తంగా

జనగామ ఎంఈఓగా శంకర్‌రెడ్డి



జనగామ రూరల్ : మండల విద్యాధికారిగా పట్టణంలోని బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురిజాల శంకర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న వంగాల రాజేందర్ రిటైర్డ్ కాగా ఆయన స్థానంలో శంకర్‌రెడ్డి ఎంఈఓగా విధులు నిర్వర్తించనున్నారు.

దేవాదుల నీటిని విడుదల చేయాలి



నర్మెట : దేవాదుల నీటిని విడుదల చేసి రైతుల పంట పొలాలను కాపాడాలని మండలంలోని వెల్దండ రిజర్వాయర్ వద్ద పలువురు రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి పంటలకు దేవాదుల నీరు వస్తాయని నాటు వేశామని ఇప్పుడు రాకపోతే అన్ని పంటలు ఎండిపోతాయని అన్నారు. ఈ సందర్భంగా లద్నూర్ మాజీ ఎంపీటీసీ సమ్మయ్య దేవాదుల అధికారులు డీఈ శ్రీధర్, ఏఈ వెంకన్నలతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే నీటిని పంపింగ్ చేయాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్ : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదివారం రాత్రి ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో భవిష్యత్‌లో చేపట్టనున్న పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్‌తో రాజయ్య చర్చించారు.

కొనసాగుతున్న దీక్షలు



నర్మెట : ఎస్సీ వర్గీకరణ అయ్యే వరకు ఇటీవల వెలువడిన ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి 6వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు బిచ్చల వంశీ, ఇరుగు కృష్ణమూర్తి, ఎల్లయ్య, నవీన్, అంజయ్య, విజయ్, సత్తయ్య, రాజు, రమేష్ పాల్గొన్నారు.

పల్లెల్లో ఎల్లమ్మ పండుగల సందడి



దేవరుప్పుల : వేసవి సమీపిస్తున్న తరుణంలో పల్లెల్లో ఎల్లమ్మ పండుగల సందడి కనిపిస్తోంది. సోమవారం రాత్రి మండలంలోని కామారెడ్డిగూడెంలో పండుగను పురస్కరించుకొని ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో ఆటపాట తో మహిళలు బోనాలు ఎత్తుకొని పుట్టగమ్మేందుకు ప్రదర్శనగా వెళ్లారు. గ్రామ దేవతల విశిష్టతను తెలిపే ఒగ్గు కథలను ప్రజలు వీక్షించారు.

క్రీడా వస్తువుల అందజేత

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు వైటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆసియా సంస్థ యువ ఇంజనీర్లు రూ. 1.50 లక్షల విలువైన ఆటవస్తువులను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు రమేష్, కమలలు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. సంస్థ ప్రతినిధి జొన్నల శ్రీనివాస్‌గుప్త, ఉపాధ్యాయులు పాఠశాల చైర్‌పర్సన్ ఆశలత, తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌కు ప్రముఖుల నివాళి

రఘునాథపల్లి: ఆత్మహత్య చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చీమలపాటి రవీందర్(58) అంతిమ యాత్రలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని నివాళులర్పించారు. ములుగు అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్, నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

కంకర పోశారు.. పరిహారం మరిచారు!

- ఆరు నెలలుగా ఎదురు చూస్తున్న రైతులు
- బీటీ వేయకుండా అడ్డుకుంటున్న బాధితులు
- టెక్స్‌టైల్ పార్క్ బైపాస్ రోడ్డు పరిస్థితి



కళ్లెం-ఏనెబావి టెక్స్‌టైల్ పార్క్ వరకు ఏర్పాటు చేసే బైపాస్ రోడ్డుపై వేసిన కంకర

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెం-ఏనెబావి గ్రామాల మధ్య ఉన్న టెక్స్‌టైల్ పార్క్ బైపాస్ రోడ్డు పనులు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండగా ఆరు నెలల క్రితం కలెక్టర్ ఆధ్వర్యంలో రైతులను ఒప్పించి రోడ్డు పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు మొదలు పెట్టి కంకర పరిచిపెట్టారు. కానీ పరిహారం ఇవ్వడం మాత్రం మరిచిపోవడంతో బాధిత రైతులంతా బీటీ వేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో టెక్స్‌టైల్ పార్క్ వరకు 1.3 కి.మీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఏనెబావి, పిట్టలోనిగూడెం గ్రామస్తులు, వ్యవసాయ రైతులు, అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

1.3 కి.మీ టెక్స్‌టైల్ పార్క్ బైపాస్ రోడ్డు

టెక్స్‌టైల్ పార్క్ వరకు వెళ్లేందుకు మండలంలోని మాణిక్యాపురం గ్రామం నుంచి వెళ్లకుండా 1.3కి.మీ బైపాస్ రోడ్డు పనులకు 13.16 ఎకరాలకు 2021లో భూసేకరణ చేశారు. ఎకరానికి రూ.14లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించడంతో ఇంత తక్కువ ధరకు రైతులు అంగీకరించలేదు. ఎక్కువ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసి పనులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు పరిహారం డబ్బులను అప్పట్లో కోర్టులో డిపాజిట్ చేశారు. దీంతో అప్పటి నుంచి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ఆగస్టులో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో రైతులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి భూమి కోల్పోయిన 13 మంది రైతులకు టీఎస్ఐఐసీ భూమి ప్లాట్లు ఇస్తామని, పరిహారం వెంటనే అందేవిధంగా చూస్తామని చెప్పి ఒప్పించారు. అందుకు రైతులు అంగీకరించడంతో అధికారులు పనులు మొదలు పెట్టారు. డబుల్ రోడ్డుకు కంకర వేసి బీటీ వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా రైతులకు పరిహారం లేదు.

పైసలు ఇస్తలేరు.. పనులు ఆపాం



ఆరు నెలల క్రితం అందరూ వచ్చారు.. పైసలు ఇప్పిస్తాం.. ప్లాట్లు ఇస్తామని చెప్పారు. సరేనని పనులకు ఒప్పుకున్నాం. నేటికి పైసలు లేవు.. ప్లాట్లు లేవు.. డాంబర్ రోడ్డు వేస్తామని అంటే అడ్డుకున్నాం. పైసలు ఇచ్చేంత వరకు పనులు అడ్డుకుంటాం. ఇప్పటికే మార్కెట్ ధరకు పోల్చుకుంటే సగం కూడా ఇస్తలేరు. అవి కూడా ఆపితే ఆ తర్వాత ఎవరిని అడుగాలే.

- కేమిడి సిద్దమ్మ, మాణిక్యాపురం, పరిహార బాధితురాలు

కంకర రోడ్డుపై ఇబ్బంది పడుతున్నాం..



రోజూ కంకర రోడ్డుపై మాణిక్యాపురం నుంచి ఏనెబావికి రావాలంటే ఇబ్బందిగా ఉంది. ద్విచక్ర వాహనాలు, కార్లు ఇతర వాహనాలు దెబ్బతింటున్నాయి. త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలి. అదేవిధంగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఓపెన్ చేసి యువతకు ఉపాధి కల్పించాలి.

- పొన్నం సురేశ్, ఏనెబావి

కోర్టులో డిపాజిట్ చేశారు

గతంలో రైతులు రూ.14 లక్షల పరిహారానికి ఒప్పుకోక పనులు చేయనీయకపోవడంతో అధికారులు కోర్టులో డిపాజిట్ చేశారు. ఆ డబ్బులు తిరిగి వాపస్ తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. రాగానే రైతులకు అందజేస్తాం.

- ఆలోజీ, ఏఈ, టీఎస్ఐఐసీ

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎంఈఓ విష్ణుమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ విష్ణుమూర్తి

లింగాలఘణపురం : విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలతో గొప్ప సైంటిస్టు కావాలని, రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ఎదగాలని ఎంఈఓ విష్ణుమూర్తి కోరారు. సోమవారం మండలంలోని పీవీఆర్ పాఠశాలలో కలామ్స్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, ఇస్రో, డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ సంయుక్తంగా స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని సైంటిస్టులుగా ఎదగాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు, స్థానిక పాఠశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మిస్సైల్స్, శాటిలైట్‌పై ప్రదర్శన, విద్యార్థుల, వివరణ తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి, ఖదీర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులు సభ్యత్వ నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని సీఈఓ కాశ బాలస్వామి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ సంఘంలో ఇప్పటి వరకు 7 వేల మంది సభ్యత్వాలను తీసుకున్నారని అన్నారు. అందులో కొంతమంది రైతులు రూ. 250లు చెల్లించిన వారు మిగతా రూ. 300లను సంఘ కార్యాలయంలో చెల్లించాలన్నారు. నూతనంగా సభ్యత్వం పొందేవారు రూ. 550లను చెల్లించాలని పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలను తీసుకొచ్చి ఇవ్వాలన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులకు పంట రుణాలను అందించామన్నారు. రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మాసపేట నరేందర్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి

లింగాలఘణపురం : మండలంలోని జీడికల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఓవర్‌లోడ్ లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రత్యేక వీసీబీలను ఏర్పాటు చేసినట్లు డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం జీడికల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో జీడికల్ వ్యవసాయ, గ్రామానికి సరఫరా అయ్యే 24 గంటల విద్యుత్‌కు సంబంధించి ఒకే వీసీబీ ఉండడంతో ఇబ్బందిగా ఉండగా వేర్వేరు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా గుమ్మడవెల్లి, సిరిపురానికి కూడ ప్రత్యేక వీసీబీలను ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆయనతో పాటు అనిల్‌కుమార్, ఏఈ శంకరయ్య, సిబ్బంది ఉన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ప్రశంసపత్రాలు, గోల్డ్ మెడల్స్‌తో విద్యార్థులు

జనగామ : జాతీయస్థాయి సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు సెయింట్ పాల్స్ విద్యార్థులు సత్తా చాటారు. పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్, ప్రశంసపత్రాలు అందుకున్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హెచ్‌ఎం మరియా జోసెఫ్ మాట్లాడుతూ కష్టపడి చదువుకుని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులను సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో సైన్స్, గణిత ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని ఏర్పాటు చేసే వరకు పోరాటం



దీక్షలో పాల్గొన్న మహిళలు

జనగామ రూరల్ : ప్రజల న్యాయమైన డిమాండ్ అయిన బాణాపురం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేసే వరకు పోరాటం ఆగదని ఐద్వా నాయకురాలు మచ్చ యాదలక్ష్మి అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు 52వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్పందించి అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని అన్నారు. ప్రమాదాల నివారణకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బూడిది ప్రశాంత్, బిచ్చల లక్ష్మి, బొల్లం సారమ్మ, గజ్వేల్లి మానస, గాదె లక్ష్మి, పావని, విజయ నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు

ముస్లింలు సమాజ హితం కోసం పాటుపడాలి



విందులో పాల్గొన్న ముస్లింలు, తదితరులు

దేవరుప్పుల : ముస్లింలు ఆచార సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజ హితం కోసం పాటుపడాలని మతగురువు ఇనాయిత్ రసూల్ సూచించారు. సోమవారం రాత్రి కామారెడ్డిగూడెం మజీదులో రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఉపవాసాల దీక్ష సందర్భంగా మహమ్మద్ గోరె సాబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గులాం రసూల్, మజీదు అధ్యక్షుడు జాకీర్, మత పెద్దలు అబ్బాస్, మహమ్మద్, రబ్బానీ, షబ్బీర్, ఖలీల్, ఖాజా, పాషా, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబీటు బజారులో స్తంభం స్థాపన



స్థాపన పూజలో పాల్గొన్న ఉత్సవ ప్రతినిధులు

జనగామ : జిల్లా కేంద్రంలోని పాతబీటు బజారులో 72వ శ్రీరామ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పందిరి స్తంభం స్థాపన (గుంజ) చేశారు. వేద పండితులు మేళ్ల చెర్వు అప్పయ్యశాస్త్రి మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. గుంజ స్థాపన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు పజ్జూరి గోపయ్య, మహంకాళి హరిశ్చంద్ర గుప్త, పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, ఐత శ్రీకాంత్, పోకల వేణు, హనుమంతరావు, అశోక్, పాండు, లోహియ, శ్రీనివాస్, బజాజ్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు అభినందనీయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

జఫర్‌గఢ్ : సీపీఐ పోరాడి సాధించిన ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కోనాయిచలం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పార్టీ బృందంతో కలిసి రమేశ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనాయిచలం రెవెన్యూ పరిధిలో 161 సర్వే నెంబర్‌లో ఉన్న 26 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ స్థలాన్ని గత బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండీ. యాకూబ్‌పాషా, సమ్మయ్య, సత్తయ్య, ఎండీ.జాఫర్, నాగరాజు, సురేందర్, మల్లయ్య, కిరణ్, పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ఈ నెల 22, 23 తేదీల్లో రైతులకు సాగునీటిని అందించాలని కోరుతూ మండలంలోని మగ్దుంతండా నుంచి వివిధ గ్రామాల మీదుగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ కార్యాలయం వరకు చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రమేశ్ కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.

రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరు మార్చండి

- ఆర్యవైశ్యమహాసభ జిల్లా తొలి అధ్యక్షుడు హరిశ్చంద్రగుప్త

జనగామ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు చేసిన ప్రభుత్వం, రాజీవ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు మహనీయులైన సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద పేర్లు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్రగుప్త డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జనగామలో మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు మార్చడంపై సీఎం రేవంత్‌రెడ్డి సమర్థించుకుంటూ, చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడదామా అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మాజీ ప్రధాన మంత్రులు ఇందిరా, రాజీవ్ గాంధీ పేర్ల మీద ఉన్న పథకాల పేర్లు తొలగించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల పేర్ల కోసం ప్రపోజల్ చేయాలన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చి ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసి, పైగా సమర్థించుకోవడం అత్యంత బాధాకరమన్నారు.

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

జఫర్‌గఢ్ : వివాహేతర సంబంధంతోనే మండలంలోని తీగారం గ్రామానికి చెందిన గోనె ప్రవీణ్‌ను హత్య చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట సీఐ కె.శ్రీనివాస్‌రావు, స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుతో వారు మాట్లాడుతూ తీగారం గ్రామానికి చెందిన గోనే ప్రవీణ్‌తో పాటు ఇదే మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన జంగిలి బాలరాజు ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఒకే మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న క్రమంలో ఇరువురి యువకుల మధ్య గొడవకు దారి తీసింది. ఈనెల 14న హోలీ పండుగ రోజున ప్రధాన నిందితుడైన జంగిలి బాలరాజు సెల్‌ఫోన్‌లో గోనె ప్రవీణ్‌తో గొడవకు దిగాడు. దీంతో ప్రవీణ్‌పై కక్ష పెంచుకున్న బాలరాజు ఎలాగైనా ప్రవీణ్‌ను అడ్డు తొలగించుకోవాలని భావించగా తన స్నేహితులతో కలిసి తమ్మడపల్లి (ఐ)లోనే మందు పార్టీ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అనంతరం ఈ నలుగురు రెండు బైక్‌లపై తీగారం గ్రామానికి చేరుకోవడం జరిగింది. మధ్యాహ్నం ప్రవీణ్ తన పంట పొలం వద్ద ఒంటరిగా ఉండడాన్ని గమనించిన ఈ నలుగురు అక్కడికి చేరుకొని ప్రవీణ్‌తో ఘర్షణకు దిగారు. వచ్చిన వారిలో ముగ్గురు ప్రవీణ్‌ను పట్టుకోగా బాలరాజు తన వెంట తెచ్చిన కత్తితో పలుమార్లు కడుపులో పొడిచి అక్కడి నుంచి అదే బైక్‌లపై పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు వారు తెలిపారు. ప్రవీణ్ హత్యకు కారకులైన జంగిలి బాలరాజు, జంగిలి అనిల్, జంగిలి రాజశేఖర్, జంగిలి ప్రశాంత్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని శ్రీవాణి గురుకుల విద్యాలయంలో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 26 ఏళ్ల అనంతరం తాము చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్న బాల్య స్నేహితులు ఉద్వేగానికి గురయ్యారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుడికి నివాళి

రఘునాథపల్లి : మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన మంద శేఖర్ విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. మండలంలోని రామన్నగూడెంలో శేఖర్ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మృతి సమాచారం తెలుసుకున్న పంచాయతీ ఉద్యోగులు కోడూర్‌కు చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్, పంచాయతీ కార్యదర్శి ఎండీ యాకుబ్, సంఘం జిల్లా నాయకులు రాజ్‌కుమార్, రాజయ్య, యాకయ్య, పరశురాములు తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

దేవరుప్పుల : మండలంలోని బంజరలో గుడుంబా తయారీ చేస్తున్న స్థావరంపై సోమవారం రాత్రి స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని బానోతు శ్వేత ఇంట్లో దాడి చేయగా 20 కిలోల పటిక, 50 కిలోల బెల్లం, 200 లీటర్ల పానకం, రెండు లీటర్ల గుడుంబా లభించింది. గుడుంబా తయారీ సామగ్రి, వస్తువులను సీజ్ చేసి పానకాన్ని అక్కడే పారపోశారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్‌కు చెందిన చొప్పరి వీరస్వామి తన ట్రాక్టర్ ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సోమవారం పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కొడకండ్ల : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన ఎలికట్టె వెంకన్న సోమవారం తాటిచెట్టుపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గీత వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకై తాటిచెట్టు ఎక్కిన వెంకన్న దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు.

26న ఢిల్లీలో ధూంధాం

జనగామ రూరల్ : అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని మార్చి 26న ఢిల్లీలో వందలాది కళాకారులచే 'ధూం ధాం' కార్యక్రమానికి రావల్సిందిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి సోమవారం హైదరాబాద్‌లో ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆహ్వానం అందజేశారు. కార్యక్రమానికి రాజ్యసభ, పార్లమెంటు సభ్యులు రాజకీయ పార్టీల అధ్యక్షులు పాల్గొంటున్నారన్నారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాలకుర్తి టౌన్ : స్థానిక సిద్దార్థ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు ఓపెన్ హౌజ్ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ ఊర్మిళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తరిగొప్పుల : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. హెచ్‌ఎంగా నేలకంటి కీర్తన, డీఈఓగా మడికొండ వంశీకృష్ణ, ఎంఈఓగా నేనావత్ ప్రశాంత్, పీడీగా భూక్య కర్ణాకర్, గంజి రాజశేఖర్ వ్యవహరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బానోతు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.